సాక్షి బాపట్ల

ఆదివారం । 31 । ఆగస్టు । 2025



సివిల్ రైట్స్ డే

వినుకొండ: మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. తహసీల్దార్ సురేష్‌నాయక్ మాట్లాడారు.



గణపతికి కుంకుమ పూజ

తెనాలి: స్థానిక నందులపేటలో శనివారం భారీ సంఖ్యలో మహిళలు గణనాథునికి కుంకుమ పూజ నిర్వహించారు. దాదాపు రెండు వేల మంది పూజల్లో పాల్గొన్నారు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి శనివారం 4,513 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద ప్రస్తుతం 12 అడుగులు నీటి మట్టం ఉంది.

న్యూస్‌రీల్

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సౌజన్య ఎంపిక

బాపట్ల జిల్లా నుంచి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయురాలు



బాపట్లటౌన్: బాపట్ల మండలం వెదుళ్లపల్లి పంచాయతీ వృక్షనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాతం సౌజన్య ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. రాష్ట్ర వ్యాప్తంగా 41 మంది ఎంపిక కాగా బాపట్ల జిల్లా నుంచి సౌజన్య ఒక్కరే ఎంపికయ్యారు. వీరికి సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో వర్క్‌షాపు నిర్వహించారు. తోటి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సులభ రీతిలో విద్యాబోధన ఏవిధంగా చేయాలి, వినూత్న రీతిలో విద్యాబోధన చేస్తే ఉపయోగం ఏవిధంగా ఉంటుందనే విషయాలను క్షుణ్ణంగా వివరించారు. జిల్లా నుంచి ఎంపికైన యాతం సౌజన్యను జిల్లా సర్వశిక్ష అభియాన్ అడిషనల్ డైరెక్టర్ నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. సౌజన్యను అభినందించిన వారిలో సమగ్ర శిక్ష లెక్చరర్ సతీష్‌రెడ్డి, పీఆర్వో కమిటీ సభ్యులు మధుసూదన్‌రావు, దుర్గా వరప్రసాద్, అస్మిత, ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

అమరావతిలో నిమజ్జన సందడి



అమరావతి: జిల్లా నలుమూలల నుంచి కృష్ణా నదిలో నిమజ్జనానికి వినాయక విగ్రహాలు తరలిరావటంతో శనివారం అమరావతిలో సందడి నెలకుంది. ఒడ్డున పోలీస్‌శాఖ, ధరణికోట గ్రామ పంచాయతీ సమన్వయంతో నిమజ్జనోత్సవాలు ఎటువంటి ఆటంకాలు లేకుండా జరిగేందుకు చర్యలు చేపట్టారు. పోలీసు శాఖ గుంటూరు రోడ్డు నుంచి రింగ్ రోడ్డు మీదుగా ఆరుడొంకల బావి సెంటర్ , ధ్యానబుద్ధ విగ్రహం వరకు కూడళ్లలో ప్రత్యేకంగా పోలీసులను ముందస్తు జాగ్రత్తగా నియమించారు. సీఐ అచ్చియ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

జీజీహెచ్‌కు శరీర దానం



ఆవుల శ్రీనివాసరావు (ఫైల్)

నాదెండ్ల: గొర్రెల మందపై కారు దూసుకెళ్లిన ఘటనలో కాపరితో పాటు రెండు గొర్రెలకు తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి తెలిసిందే. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన పల్నాడు జిల్లా గణపవరం గ్రామానికి చెందిన ఆవుల శ్రీనివాసరావు(45) గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతని భార్య కరోనా సమయంలో మృతి చెందగా, కుమారుడు ఉన్నాడు. మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతిచెందిన శ్రీనివాసరావు భౌతికకాయాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భూ వివాదాలకు చెక్ పెట్టేందుకే 'నక్ష' కార్యక్రమం



మంగళగిరి టౌన్: పట్టణాల్లో రెవెన్యూ రికార్డులను పక్కాగా అమలు చేయడానికి, భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బెస్ట్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్ (నక్ష) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంగళగిరి నగర అసిస్టెంట్ సిటీ ప్లానర్ అజయ్‌కుమార్ తెలిపారు. నక్ష పైలెట్ ప్రోగామ్‌లో భాగంగా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ ఏరియల్ సర్వేకు ఎంపికైందని, ఇందులో భాగంగా భూ రీసర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. భూములకు సరిహద్దులు నిర్ధారించడంతోపాటు నక్ష పటాన్ని రూపొందిస్తామని అన్నారు. భూముల డిజిటలైజేషన్ ద్వారా సమగ్ర సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

కొత్త పింఛన్ ఇచ్చేదెన్నడో!



గ్రామ సచివాలయం

- గ్రామ సచివాలయాల చుట్టూ వృద్ధులు, వికలాంగులు ప్రదక్షిణ
- కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా పట్టించుకోని వైనం
- ఇప్పటికీ ప్రారంభం కాని దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ

వేటపాలెం: పేదలకు సంక్షేమం అందించడంలో కూటమి ఘోరంగా విఫలమైంది. ఏడాదిన్నర కాలంలో ఆవేదన తప్ప మిగిలిందేమీ కనిపించడం లేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా నేటికీ ఒక్క సంక్షేమ పథకం కూడా సమర్థవంతంగా అమలు చేసిన దాఖలాల్లేవు. చివరకు ఏ దిక్కూ లేని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు కూడా పింఛన్లు మంజూరు చేయడం లేదు. దీంతో పలువురు అర్హులు ఎప్పుడు పింఛన్ మంజూరు చేస్తారంటూ సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇటీవల స్పౌజ్ కేటగిరీలో పింఛన్ల మంజూరు చేసింది. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతేనే భార్యకు ఆ పింఛన్‌ను బదిలీ చేస్తున్నారు. అసలు ఇప్పటికీ పింఛన్ రాని వ్యక్తి చనిపోతే వితంతు పింఛన్ ఇవ్వకుండా మొండి చేయి చూపిస్తున్నారు. అలాగే ఇతర సామాజిక పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారిని పట్టించుకోవడం లేదు. బాపట్ల జిల్లాలో ప్రస్తుతం 2,27,868 మంది సామాజిక పెన్షన్ దారులున్నారు. చీరాల నియోజకవర్గ పరిధిలో 30,239 మంది ఉండగా వీరిలో చీరాల అర్బన్ పరిధిలో 8,093 మంది, రూరల్ పరిధిలో 11,438 మంది, వేటపాలెం మండలం పరిధిలో 10,718 మంది సామాజిక పింఛన్లు పొందుతున్నారు.

అమలు కాని ఎన్నికల హామీ

ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వారికి 50 ఏళ్లకే పింఛన్ అందజేస్తామని హామీ ఇచ్చింది. ఇంత వరకు దీనిని ఆచరణలో పెట్టలేదు. ఎప్పటి నుంచి



అమలు చేస్తారో కూడా ప్రకటించ లేదు. జిల్లాలో అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు, కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రతిరోజూ సామాజిక పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వస్తున్నారు. ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని వారికి సచివాలయ సిబ్బంది సమాధానం చెబుతుండటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

కొత్త పింఛన్ల నమోదుకు ఆదేశాలు రావాల్సి ఉంది

కొత్తగా పింఛన్లు కోసం నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి ఇంకా ఎటువంటి ఆదేశాలు రాలేదు. అందుకు సంబంధించిన వెబ్‌సైట్‌లు ఓపెన్ కావడం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొత్త పింఛన్లు నమోదు చేసుకుంటాం.

–రాజేష్ ఎంపీడీఓ, వేటపాలెం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న ఆరు నెలల్లోనే కొత్త పింఛన్లు మంజూరయ్యేవి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేకుండా ప్రస్తుత ప్రభుత్వం పెన్షకు సంబంధించి వెబ్‌సైట్ నిలిపివేయడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్హులైన వారు నిత్యం గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బంది పడుతున్నారు. పింఛన్ల మంజూరులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమనసరించిన విధానమే సరైందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్‌దారులకు ఇంటి వద్దే పింఛను అందించేవారు. భర్త చనిపోయిన వారికి వితంతు పింఛన్లు మరుసటి నెలలోనే మంజూరు చేసేలా చర్యలు తీసుకునేవారు. ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్లు మంజూరుకు అవకాశం కల్పించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేకపోవడంతో అర్హులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువ శాతం పింఛన్ మంజూరు చేయాలని అర్జీలు అందిస్తున్నారు.

పొగాకు రైతులకు అండగా ఉంటాం

- ఏపీ వ్యవసాయం, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఎస్‌డబ్ల్యూసీ మేనేజింగ్ డైరెక్టర్ విజయ సునీత
- పర్చూరులో పొగాకు గోదాముల పరిశీలన



పర్చూరులో పొగాకు నాణ్యత పరిశీలిస్తున్న ఎండీ విజయ సునీత, కలెక్టర్ వెంకట మురళి

పర్చూరు(చినగంజాం): సంక్షోభం నుంచి రైతులను బయటకు తెచ్చేలా పొగాకు కొనుగోలు చేపట్టాలని ఏపీ వ్యవసాయం, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, ఎస్‌డబ్ల్యూసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. జిల్లాకు వచ్చిన ఆమె కలెక్టర్ జె. వెంకటమురళితో కలసి పర్చూరు మండలంలో శనివారం పర్యటించారు. పర్చూరు మండలం మార్కెట్ యార్డులోని గోదాముల్లో నిల్వ చేసిన పొగాకు బేళ్లను ఎండీ విజయ సునీత, కలెక్టర్ జె.వెంకట మురళి పరిశీలించారు. వాటి నాణ్యత ప్రమాణాలను పరిశీలించిన అనంతరం కొనుగోలు తీరుపై ఆరా తీశారు. జిల్లా పర్యటనలో భాగంగా బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు, గోదాముల్లో నిల్వ, ప్రాసెసింగ్ ప్రక్రియ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సమావేశం అయ్యారు. పొగాకు ప్రాసెసింగ్ కోసం సిద్ధం చేసిన డబ్ల్యూబీఆర్, డబ్ల్యూబీఎల్, డబ్ల్యూబీఎక్స్ రకాల నమూనాలను పరిశీలించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పొగాకును ప్రాసెసింగ్ చేయడానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. రైతుల బ్యాంకు ఖాతాల పరిశీలన పూర్తయితే తక్షణమే వారికి నగదు పంపుతామన్నారు. బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు సెప్టెంబర్‌లోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. బాపట్ల జిల్లాలో 9,900 టన్నుల బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు చేశామని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాన్నాయన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన బ్లాక్ బర్లీ పొగాకు నిల్వ చేయడానికి 18 వ్యవసాయ మార్కెటింగ్ శాఖ గోదాములను గుర్తించామని తెలిపారు. మరో 11 ప్రైవేట్ గోదాములు ఖాళీగా ఉన్నట్లు గుర్తించామన్నారు. మార్కెటింగ్ శాఖ ఆర్‌జేడీ కె.శ్రీనివాసరావు, ఆర్‌డీ డీఎం దివాకర్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి కె.రమేష్ బాబు, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఆర్డీఓ పి.గ్లోరియా తదతరులున్నారు.

స్వామిత్వ సర్వే పకడ్బందీగా చేయాలి



బల్లికురవలో స్వామిత్వ సర్వే తనిఖీ చేస్తున్న డీపీఓ

బల్లికురవ: గ్రామాల వారీగా జరుగుతున్న స్వామిత్వ సర్వేలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు అన్నారు. బల్లికురవ మండలంలో జరుగుతున్న సర్వేపై శనివారం స్థానిక పరిషత్ కార్యాలయంలో వెక్టరైజేషన్‌లో భాగంగా పంచాయతీ సెక్రటరీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లోని ప్రజలకు సంబంధించిన ఆస్తులను గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. సర్వేలో మోసాలు తలెత్తకూడదని.. 2 నెలల ముందు సర్వే పూర్తిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ జ్వరాలు వ్యాధులు సోకకుండా నవంబర్ వరకు పారిశుద్ధ్య కార్యక్రమాలు స్పెషల్ డ్రైవ్‌గా చేపట్టాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్య వంతమైన సమాజం సాధ్యమన్నారు. ఎంపీడీవో కుసుమకుమారి, కార్యాలయ ఏవో పాండు రంగస్వామి పాల్గొన్నారు.

ఉపాధి నిధులు బొక్కేశారు..!



కొద్దిమందితో ఉపాధి పనులు (ఫైల్)

- బల్లికురవ ఉపాధి పనిలో సగానికి సగం అవినీతి
- ఏడాదిలో రూ.11.96 కోట్ల పనులు
- రూ.5.69 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేల్చిన సామాజిక తనిఖీ
- జిల్లాలో రూ.261 కోట్ల పనులు
- ఇందులో 70 శాతం అవినీతి జరిగిందని ఆరోపణలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: అద్దంకి నియోజకవర్గం బల్లికురవ మండలంలో గడచిన ఏడాదిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.11,96,76,824 మేర పనులు జరిగినట్లు అధికారిక గణాంకాలు చెబుతుండగా.. ఇందులో రూ.5,69,41,282 అవినీతి జరిగినట్లు ఆగస్టు మొదటి వారంలో జరిగిన సామాజిక తనిఖీ వెల్లడించింది. దీనిని కప్పిపుచ్చేందుకు మండల ప్రిసైడింగ్ అధికారి హోదాలో జిల్లా డ్వామా అధికారి ప్రయత్నించినట్లు జరిగిన తతంగం పరిశీలిస్తే అర్థమవుతుంది. సామాజిక తనిఖీ చూపిన దాంట్లో రూ.3,89,46,581 మొత్తాన్ని అక్రమాల కింద అంగీకరించిన మండల ప్రిసైడింగ్ అధికారి ఇందులో రూ.2,36,03,181 మొత్తాన్ని రికవరీ కింద రాసి మిగిలిన రూ.1,16,66,909 మొత్తాన్ని రిఫర్డ్(మళ్లీవిచారణ) కింద, రూ.36,91,856 మొత్తాన్ని రెక్టిఫైడ్ (సరిచేసుకోండి) కింద చూపి రూ.1,79,79,336 మొత్తాన్ని డ్రాప్‌డ్ అమౌంట్ కింద చూపెట్టి చేతులు దులుపుకున్నారు. సామాజిక తనిఖీ చూపెట్టిన అవినీతి రూ.5.69 కోట్లలో రికవరీ రూ. 2.36 కోట్లు మినహా మిగిలిన రూ.3.33 కోట్ల మొత్తాన్ని మాఫీ చేశారు. దీనివెనుక పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు డ్వామావర్గాల్లోనే గుసగుసలువినిపిస్తున్నాయి.

జిల్లాలో రూ.140 కోట్ల అవినీతి

జిల్లాలో గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.261 కోట్ల పనులు జరిగినట్లు అధికారిక గణాంకాలు చెబుతుండగా.. ఉద్యాన పంటలు, సేద్యపు నీటికుంటలు, పశువుల తాగు నీటి తొట్లతోపాటు పలురకాల కాంక్రీట్ పనులు చేపట్టారు. ఇందులో రూ.199.56 కోట్ల మేర వేతనాల పనులు కల్పించినట్లు చూపారు. ఇందులో 70 శాతం అక్రమాలు అనుకున్నా రూ.140 కోట్ల మేర అవినీతి జరిగినట్లు ఆరోపణలున్నాయి. జిల్లా మొత్తంగా జరిగిన ఉపాధి పనులపై ఉన్నతాధికారితో సమగ్ర విచారణ జరిపిస్తే అవినీతి బట్టబయలయ్యే అవకాశముంది.

సాగునీటి మాటున ఉపాధి అవినీతి

వాస్తవానికి ఉపాధి పనులు నవంబర్, డిసెంబర్, జనవరిలో 20 శాతం మాత్రమే జరుగుతుండగా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మిగిలిన 80 శాతం జరుగుతున్నాయి. ఆ తర్వాత వర్షాలు కురవడం, సాగునీటి పథకాల ద్వారా కాలువలకు నీటిని విడుదల చేస్తుండడంతో పనులు చేయకపోయినా అధికారులకు చేసినట్లు రికార్డు చేసి నిధులు కొల్లగొడుతున్నారు. ఉపాధి పనులను ప్రతి మూడు నెలలకొకసారి సామాజిక తనిఖీ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధనలను అమలు చేస్తే అక్రమాలను కంట్రోల్ చేసే అవకాశముంటుంది. కానీ డ్వామా అధికారులు ఏడాదికి ఒకసారి మాత్రమే సామాజిక తనిఖీలు పెట్టి అవినీతి బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు.

సామాజిక తనిఖీల్లో షాట్, డ్వామా కుమ్మక్కు

నిబంధనల మేరకు పంచాయతీరాజ్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 'షాట్', డ్వామా అధికారులు కలిసి ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తారు. వాస్తవానికి సామాజిక తనిఖీ తొలుత గ్రామస్థాయిలో జరుగుతుండగా ఇందులో గ్రామస్థాయిలో ప్రిసైడింగ్ అధికారిగా మండలానికి చెందిన కొందరు గెజిటెడ్ అధికారులను నియమిస్తారు. గ్రామస్థాయి సామాజిక తనిఖీల్లో వీరిది జడ్జి పాత్ర. తప్పు జరిగితే ఎత్తిచూపే అవకాశం ఉంటుంది. కానీ గ్రామస్థాయి తనిఖీలకు వీరిని ఆహ్వానించకుండానే షాట్, డ్వామా అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల వీరి నియామకమే జరగకపోగా మరికొన్ని మండలాల్లో వీరిని నియమించినా.. డ్వామా అధికారులు తనిఖీలకు పిలవడంలేదు. దీంతో అటు షాట్, ఇటు డ్వామా అధికారులు కుమ్మక్కై పది శాతం అక్రమాలు చూపించి 90 శాతం అక్రమాలను మాఫీ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

పీహెచ్‌సీల్లో జ్వర పీడితుల పడిగాపులు



కొల్లూరు పీహెచ్‌సీలో వైద్యులు రాక కోసం రోగుల పడిగాపులు

- సమయపాలన పాటించని వైద్యులు
- ప్రైవేటు వైద్యశాలల వైపు చూపు



కొల్లూరు పీహెచ్‌సీలో నీరసించిన చిన్నారి వద్ద నిలబడి వైద్యుల కోసం నిరీక్షిస్తున్న ఓ తండ్రి

కొల్లూరు: ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. జ్వర పీడితులు, ఇతర అనారోగ్య సమస్యలతో వచ్చిన రోగులు గంటల కొద్దీ పడిగాపులు పడుతున్నారు. ఊరూర జ్వరాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండాల్సిన వైద్యులు ఇష్టానుసారం విధులకు హాజరవుతున్నారు. దీంతో రోగులు అవస్థలు పడుతున్నారు. కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యాధికారిణితోపాటు, అదనపు వైద్యులు వైద్య సేవలు అందించడానికి సమయానికి అందుబాటులో ఉండని కారణంగా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం జ్వరపీడితులతోపాటు, ఇతర రోగులు వైద్య పరీక్షల కోసం వైద్యశాలకు వచ్చి వైద్యుల కోసం 10 గంటల వరకు వేచి చూసినా పత్తా లేకపోవడంతో జ్వర పీడితులు నీరసించి కూలబడ్డారు. జ్వరంతో బాధపడుతున్న ఓ చిన్నారిని తండ్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నీరసించిన చిన్నారిని ఓపీ విభాగం కోసం నిర్మించిన గోడపై పడుకోపెట్టి నిరీక్షించాల్సి వచ్చింది. వైద్యులు సమయానికి అందుబాటులో లేని కారణంగా కొంత మంది జ్వర బాధితులు వేచి ఉండే ఓపిక లేక ప్రైవేటు వైద్యశాలలకు తరలివెళుతున్నారు.

అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలి

సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల పక్కన ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దివ్యసాయి శ్రీవాణి

రేపల్లె: పెండింగ్ కేసుల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించతలబెట్టిన జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల కోరారు. సెప్టెంబర్ 13వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌పై స్థానిక కోర్టు హాలులో శనివారం పోలీసులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా కేసులు త్వరగా పరిష్కారం అవ్వటంతో పాటు కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందన్నారు. లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, ప్రిలిటిగేషన్‌లతోపాటు బీఎస్ఎన్‌ఎల్, బ్యాంక్‌లకు సంబంధించిన కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దివ్యసాయి శ్రీవాణి, సీనియర్ న్యాయవాదులు పీఎస్‌బీ శర్మ, జీ.వెంకటేశ్వరరావు, కే.నాగాంజనేయలు, పోలీసు, రెవెన్యూ, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.